
# సుబ్బారావు-సుబ్బలక్ష్మి


బి.వి.ఎస్. వరప్రసాదరావు



## పాపం, సుబ్బారావు!

ఇంకా పెళ్ళికాలేదు. ఉద్యోగం పురుష లక్షణం అన్నారు కాబట్టి సుబ్బారావు ఏదో ఉద్యోగం వెలగ బెడుతున్నాడు. 'హోటల్ కూడు ఆరోగ్యానికి చేటు అని తెలిసిన వాడై ఒక గది తీసుకుని అందులో ఉంటూ స్వయంపాకం మొదలెట్టాడు. సుబ్బారావుకో బామ్మ ఉంది. ఆవిడ సొంత పల్లెటూరిలో పశువులు, పిడకలు వ్యవహారం చూసుకుంటుంది. ఆ బామ్మ పదరు సుబ్బారావును పెళ్ళి చేసుకోరా, పెళ్ళి చేసుకోరా అని జపం చేస్తున్నట్లు రోజూ వంద సార్లు గోలపెడుతూ ఉంటుంది. "నాయనా! సుబ్బుడూ! రోజూ పెళ్ళి చేసుకోరా, పెళ్ళి చేసుకోరా అని అరవడంతోనే నా శేష జీవితం గడిచిపోయే టట్టుగా ఉండి నరకానికి పోతానన్న భయంగా ఉందిరా! పెళ్ళి చేసుకుంటే కృష్ణా, రామా అనుకుంటూ స్వర్గానికైనా వెడతాను, నాయనా! ఎంత కాల మీ కంఠశోష!" బామ్మగారి ఆపసోపాలు.

"అబ్బ ఉండు, బామ్మా! రోజూ ఏదో గోల! చదువరా ... చదువు ... తర్వాత ... ఉద్యోగంరా ... ఉద్యోగం ... ఆటు తర్వాత పెళ్ళిరా ... పెళ్ళి ...




ఇహ దీని తరవాత పిల్లలురా ... పిల్లలు ... మళ్ళీ ఆడపిల్లలు పుడితే మగపిల్లాడురా ... మగపిల్లాడు... ఇంకా తరవాత ... ఇలా జీవితాంతం అరవడమే! ఇహ నీకు హరేరామ, హరే కృష్ణ అనుకునే దెక్కడ? ఒక్క రోజు సుఖంగా, విశ్రాంతిగా ఉండనివ్వవు కదా!'' విసుక్కున్నాడు సుబ్బుడు అనబడే సుబ్బారావు.

''హవ్వ!'' నోరు నొక్కుకుంది బామ్మగారు.

''లక్షణంగా ఉద్యోగం చేస్తున్నావు. జీవితాంతం పెళ్ళి పెటాకులూ లేకుండా ఇలాగే ఉండిపోతావా ఏమిటే? ఇంతోటి దానికి ఉద్యోగం ఎందుకు? హవ్వ! ఎవరైనా నవ్విపోతారు పెళ్ళి వద్దంటే. నీ కేమిరా! బుద్ధిమంతుడివి! సలక్షణమైన ఉద్యోగం ఉంది. వంశం నిలవద్దుటరా—పున్నామ నరకం నుంచి తప్పించడానికి ఒక కొడుకుని కనాలిరా, నాయనా!''

బామ్మ మాటలకు అడ్డు వచ్చాడు సుబ్బారావు.

''ఆ పున్నామ నరకం మాట ఎలాగున్నా నేనీ నరకం భరించలేకుండా ఉన్నాను. సరే! నీ మాట ఎప్పుడు కాదన్నాను? కాదంటే చీపురు తిరగెయ్యవూ? చూడు—చూడు—మంచి పిల్లని!'' అనేసి చక్కా పోయాడు సుబ్బారావు.

''మా నాయనే! అంత మాట అన్నావు, చాలు—క్షణాల మీద మంచి పిల్లని చూసి ముడెయ్యనూ!'' దీర్ఘం తీసింది బామ్మగారు.

ఒక శుభ ముహూర్తంలో సుబ్బారావును, సుబ్బలక్ష్మికి వివాహం జరిగిపోయింది.

సుబ్బుడిని, సుబ్బమ్మను చూచి మురిసిపోయింది బామ్మగారు.

● ● ● ●

''నాయనా, సుబ్బా! నేనిక మన పల్లెటూరికి వెడతాను. అక్కడ కొంపా, గోడూ ఎలా ఉన్నాయో, ఏమిటో? నేను తిరిగి వచ్చేసరికి నాకో మునిమనవడిని ఇవ్వాలి! తెల్సిందా!'' ప్రయాణ మవుతూ చెప్పింది బామ్మగారు.

''అదేమిటి, బామ్మా! ఇక్కడే ఉండకూడదూ! ఆ పల్లెటూర్లో నీవు చేసేదేమిటి? పేడ పోగు చేయడం, పిడకలు కొట్టడం! అంతేగా! లక్షణంగా ఉద్యోగం చేసే మనవడిని నేనుండగా ఆ వెధవ పిడకలు దేనికి, బామ్మా! అందుకే పుర్రెతో పుట్టిన బుద్ధి పిడకలతోగాని పోదన్నారు!'' దిగులుగా అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావుని దగ్గరకు తీసుకుంది బామ్మగారు.

''సుబ్బా! పానకంలో పుడకలాగా నే నెందుకురా ఇక్కడ! ఇది అనుభవించే వయసు. హాయిగా ఉండండి. నే నెందుకురా మధ్య—వెర్రి నాగన్నా! మీ జీవితం పచ్చగా ఉండి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలి'' అన్నది బామ్మగారు.

''పువ్వులు, కాయలు సంగతి అలా ఉంచు. మూడు పేడ పోగులు, ఆరు పిడకలుగా ఉంటుంది నా పరిస్థితి. నీ వెళ్ళిపోతే ఎలాగే, బామ్మా!'' దాదాపు ఏడ్చినట్లే అన్నాడు సుబ్బారావు.

బామ్మగారి హృదయం కరిగింది.

''అమ్మాయ్, లక్ష్మి! వీడింకా పసిపిల్లవాడుగానే ఉన్నాడు నా దృష్టిలో. వీడంత అమాయకుడు ఇంకొకడు లేడు. ఎలాగో వీడ్ని ఇంతవరకు పెంచాను. పనిపాటలు నేర్పాను. నీ ముద్దుముచ్చటలు, మురిపాలతో వాడు నన్ను మర్చిపోయేటట్టు చెయ్యి, తల్లీ! నీ కడుపున వో కాయ కాస్తే చూచి చచ్చిపోతాను, తల్లీ! వీడిని ఎలాగు చూస్తావో ఏమిటో!'' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది బామ్మగారు.

''అదేమిటి, బామ్మా! దీని కడుపున కాయగాని పిల్లలు పుట్టరా! కాయకోసం దీన్నే పెళ్ళి చేసుకోవాలేమిటే? చెట్టుకిచ్చి పెళ్ళి చేస్తే పోలా!'' అన్నాడు సుబ్బారావు అమాయకంగా.

కిసుక్కున నవ్వింది సుబ్బలక్ష్మి.

ఆ నవ్వులు చూచి సుబ్బారావు మెలికలు తిరిగి పోయాడు.

''పోరా! మరీ వేళాకోళంగా మాట్లాడుతున్నావ్!'' కసిరింది బామ్మగారు.

బామ్మగారు ప్రయాణమైంది. సుబ్బారావుకి కష్టాలు ప్రారంభమైంది.

''అబ్బ! ఈ కూర చాలా బాగుందండీ!''

''వోహో! ఏమి పచ్చడి! ఏమి పచ్చడి!''

''ఆహా! ఏమి సాంబారు! ఏమి సాంబారు!''

అవురావురుమంటూ తింటోంది సుబ్బలక్ష్మి.

గిన్నె, గరిటెతో నిల్చున్న సుబ్బారావు పళ్ళు నూరుతున్నాడు.

''ఏమండీ! పోయిన జన్మలో మీరు సలభీముడై ఉంటారు. అదృష్టవశాత్తూ ఈ జన్మలో నా భర్త అయ్యారు. ఇంతకంటె ఆడదానికి కావాల్సిన దేముందీ?'' లొట్టలు వేస్తూ అన్నం తింటోంది.

'పోయిన జన్మలో నీవు నా మొగుడై ఉంటావు—అందుకే నా ఖర్మ ఇలా కాలింది!' కసిగా అనుకున్నాడు సుబ్బారావు మనసులో.

సుబ్బారావు వంట చేస్తున్నాడు.

సుబ్బారావు నీళ్ళు తోడుతున్నాడు.

సుబ్బారావు బట్ట లుతుకుతున్నాడు.

సుబ్బారావు ఇల్లు వూడుస్తున్నాడు.

నెలకు మూడు రోజు లనుకునేరు! కాదు! కాదు! నెలకు మొప్పయి రోజులు అలాగే చేస్తున్నాడు. సుబ్బలక్ష్మికి జబ్బా! కానే కాదు! ఆవిడ పిడిరాయి లాగా ఉండి కథలు రాసి, నవలలు చదువుతూ కూర్చుంటుంది. ఇలా కొన్ని నెలలు గడిచాయి. సుబ్బారావుకి సహనం నశించింది. తాడో, పేడో తేల్చేయాలని అనుకున్నాడు. అనుకుని భార్యామణిని పిలిచాడు:

''సుబ్బలూ! ఇంకా నేను ఆడంగి పనులు చేస్తూంటే పెళ్ళెందుకు చేసుకోవడం! అపుడంటే సింగిల్ సర్వీసు. ఇపుడు డబుల్ సర్వీసు అయింది నా బ్రతుకు! ఇటు ఇంటి పని చూచుకోనా! అటు ఆఫీసు పని చూచుకోనా! ఎపుడూ కథలు, నవలలు చదవడం, రాయడం! పోనీ రాశావూ! ఒక్కటైనా పత్రికలలో తగలడ్డాయా! లేదు! తిరిగి వచ్చి పొయ్యిలో తగలడుతున్నాయి. అసలు విషయానికి వస్తాను. నీకు వంట వచ్చునా!'' అడిగాడు సుబ్బారావు.

''రాదు!'' అన్నది బింకంగా సుబ్బలక్ష్మి.

ఆశ్చర్యపోయాడు సుబ్బారావు.

''బట్ట లుతకడం!''

''అదీ రాదు.'' ఏడుస్తున్నట్లే చెప్పింది సుబ్బలక్ష్మి.

ఇంకా ఆశ్చర్యపోయాడు సుబ్బారావు.

''పోనీ, ఇల్లు వూడవటం, నీళ్ళు తోడటం...''

''అదికూడా రాదు.'' గొల్లుమంది సుబ్బలక్ష్మి.

సుబ్బారావుకూడా గొల్లుమన్నాడు.

''ఇంత చేతకానిదానివి నన్నెందుకు పెళ్ళిచేసుకోవడం? నా ప్రాణం తీయడానికా!'' అరిచాడు సుబ్బారావు.

మాట్లాడకుండా కన్నీళ్ళు పెట్టుకుంటూ కూర్చుంది సుబ్బలక్ష్మి.

''ఏమిటి! మాట్లాడవూ?''

''దాని కో కథ ఉంది.''

''ఏ మా కథ!'' ఆమె ముందు కూలబడ్డాడు సుబ్బారావు.

''నేను నా తల్లితండ్రులకు ఒకటే సంతానం. నన్ను అల్లారుముద్దుగా పెంచారు. కాలు కింద పెట్టనిచ్చేవారు కారు. పని చెయ్యనిచ్చేవారు కారు. అలాగే పెరిగాను. పెళ్ళీడు వచ్చింది. ఎంత అందం

ఉండి ఏం లాభం, ఇంటి పనులు చేతకానప్పుడు! అపుడు నా స్నేహితురాలు ఒకామె ఉండేది. విమల అని ఆవిడ మన పల్లెటూరిలో మీ ఇంటి కెదురుగా ఉండేది! మీకు తెల్సి ఉండాలే!'' సాగదీసింది సుబ్బలక్ష్మి.

"వూఁ.'' మూల్గాడు సుబ్బారావు.

''ఆవిడ చెప్పింది—ఫలానా సుబ్బారావుగారు,ఫలానా బామ్మగారి మనవడు బుద్ధిమంతుడు. ఇంటిపనులు—అంటే వంట చేయడం, ఇల్లు వూడవడం, నీళ్ళు తేవడం వగైరాలు బాగా చేస్తాడట. బామ్మగారి మాట జవదాటని అపర శ్రీరామచంద్రుడట. ఆయన కిప్పుడు లక్షణమైన ఉద్యోగం టవునులో దొరికి గది తీసుకుని స్వయంపాకం చేసుకుంటున్నాడు అన్నది విమల. అప్పుడు నే నడిగాను—ఆ సుబ్బారావు గారు బాగుంటారా అని. విమల అంది కదా—నవలలో రాసే హీరో అంత బాగుండడు గాని పొడుగూ పొట్టీ కాదు—లావు, సన్నం కాదు—మరీ అందగాడు, మరీ అనాకారి కాదు అని మొదలెట్టింది. మగాడు, ఆడది కూడా కాదంటావ్ అన్నా న్నేను. విమల విరగబడి నవ్వింది.'' కొంచెం ఆగి ఓరకంట చూచింది సుబ్బారావుని సుబ్బలక్ష్మి.

సుబ్బారావు సీరియస్ అయ్యాడు. పళ్ళు పటపట కొరికాడు.

కిసుక్కున నవ్వింది సుబ్బలక్ష్మి. మళ్ళీ కొన సాగించింది కథ:

'ఆయన్ను చేసుకుంటే నీవు సుఖపడతావ్—నిన్ను కూర్చోబెట్టి ఆయనే ఇంటి పనులు చేసుకుంటూ పోతాడు' అన్నది విమల విరగబడి నవ్వుతూ.

అది విన్న నా మనసు ఆనందంతో ఎగిరి గంతు లేసింది. వెంటనే అన్నాను విమలతో—''ఆయన్ను చూడాలని ఉందే!''

'ప్రతి ఆదివారం బామ్మగారిని చూడ్డానికి ఈ వూరుకు వస్తుంటాడు—అపుడు చూపిస్తాను. మన ఇంటి ముందే వెడతాడు' అన్నది విమల. ఆదివారం రానే వచ్చింది. మిమ్మల్ని చూపించనూ చూపించింది. మీరు తల వంచుకుని కన్నెత్తి ఎవర్నీ చూడకుండా ముక్కుకు సూటిగా పోతున్నారు. అపుడు మిమ్మల్ని చూస్తుంటే బలే ముచ్చట వేసిం దనుకోండి.

తరవాత ఈ సంగతి నా తలిదండ్రులకు చెప్పాను. వారు పరమానంద భరితులై మీ బామ్మ గారితో మాట్లాడడం, పెళ్ళి చూపులు, సంబంధం నిశ్చయం కావడం, తరవాత మన పెళ్ళి ...'' ఆగి పోయింది సుబ్బలక్ష్మి.

''మాబాగా చేశారు పెళ్ళి! నీకు కాదు—నాకు!'' పళ్ళు నూరాడు సుబ్బారావు.


కిసుక్కున నవ్వింది సుబ్బలక్ష్మి.

''బామ్మ నా గొంతు కోసింది ఈ పెళ్ళి చేసి!'' కోపంతో వూగిపోయాడు సుబ్బారావు.

మళ్ళీ కిసుక్కున నవ్వింది సుబ్బలక్ష్మి.

ఉడుక్కున్నాడు సుబ్బారావు.

''ఏమిటా నవ్వులు! ఫో! ఇక్కడ్నుంచి!'' గద్దించాడు సుబ్బారావు. బెదిరి సుబ్బలక్ష్మి లేచి వెళ్ళిపోయింది లోపలికి. తలమీద చేతులు పెట్టుకుని కూర్చున్నాడు




సుబ్బారావు.

• • • •

''చెల్లెమ్మా! చెల్లెమ్మా!'' తలుపు కొడుతున్న చప్పుడు.

సుబ్బలక్ష్మి వెళ్ళి తలుపు తీసింది.

మోహన్! సుబ్బారావు ఆఫీసులో పనిచేస్తున్నాడు.

''ఏమి టన్నయ్యగారూ! ఏమిటా కంగారు?'' అడిగింది సుబ్బలక్ష్మి తనూ కంగారుపడుతూ.

''కంగారు కాక మరేమిటమ్మా! మీ ఆయన సాయంత్రం ఆఫీసు వదిలి పెట్టగానే ఇంటికొచ్చే వాడా?''

''లేదు, అన్నయ్యగారూ! ఇదివరకు వచ్చేవారు. ఇపుడైతే రాత్రి పది దాటితే గాని రావటంలేదు. ఎక్కడకు వెళ్ళారని అడిగితే ఏమీ మాట్లాడటం లేదు. ఏమిటో, అన్నయ్యగారూ! ఎక్కడ తిరుగు తున్నారో, ఏమిటో నా కేమీ అర్థం కావటం లేదు. మీకు పుణ్యముంటుంది—సంగతి తెలుసుకోండి.'' ప్రాధేయ పూర్వకంగా అడిగింది సుబ్బలక్ష్మి.

''తెల్సుకున్నాను, చెల్లెమ్మా! అదే చెప్పబోతున్నాను. మీ ఆయన పేకాట ఆడుతున్నాడు. ఇవ్వాళ మరీ ఘోరంగా ఆడుతున్నాడు. ఎందుకంటే, జీతాలు వచ్చిన రోజు కదా!''

మిన్ను విరిగి మీద పడ్డట్టయింది సుబ్బలక్ష్మికి. తేరుకుని ''అదేమి టన్నయ్యగారూ! నమ్మ బుద్ధి కావడం లేదు. ఆ మనిషి అలాంటి రకం కాదే. ఇపుడు నేనేమి చెయ్యాలి దేముడో.'' కూలబడింది సుబ్బలక్ష్మి.

''నమ్మకపోతే అది నీ ఖర్మ! నా కళ్ళతో నేను ప్రత్యక్షంగా చూశాను. వాడు అట్లా చెడిపోతుంటే చూడలేక, నీవన్నా బాగుచేస్తావని నీతో చెప్పాను. వెళ్ళి వస్తాను'' అంటూ వెళ్ళిపోయాడు మోహన్.

• • • •

''సుబ్బలక్ష్మిగారూ... సుబ్బలక్ష్మిగారూ ...'' మళ్ళీ తలుపు చప్పుడు.

''ఎవరూ?'' నీరసంగా అని తలుపు తీసింది సుబ్బలక్ష్మి.

ఎవరో అపరిచిత వ్యక్తి!

''ఎవరండీ మీరు? ఎవరు కావాలి?''

''మీరేనా సుబ్బలక్ష్మిగారంటే. నేనమ్మా రామాన్ని! మీ ఆయన — అదే సుబ్బారావుగారి ఆఫీసులో పనిచేస్తున్నాను.''

'మళ్ళీ ఏమి వచ్చింది దేముడో' అనుకుని ''ఏమిటి సంగతి, రామంగారూ'' అని ఆత్రతగా అడిగింది సుబ్బలక్ష్మి.

''మొగుడిని కంట్రోలులో పెట్టుకోవాలమ్మా. అలా విచ్చల విడిగా వదిలేస్తే నీ జీవితం ఏమవుతుందో ఆలోచించావా?''

''ఏం జరిగింది, రామంగారూ!'' ఆత్రతను ఆపు కోలేక అడిగింది సుబ్బలక్ష్మి.

''ఇంకా ఏం జరగాలి, తల్లీ! పేకాట మరిగాడా—ఇపుడు మరొకటి మరిగాడు.''

''అదేమిటి, రామంగారూ! తొందరగా చెప్పండి.'' సుబ్బలక్ష్మి గోల.


''వ్యసనా లన్నాయి చూచావూ! వాటికి మనిషి మరిగాడు అంటే హరిహర బ్రహ్మాదులు సైతం వాడిని సరిచేయలేరు. సుబ్బారావు అంతకు ముందు ఎలాగు ఉండేవా డనుకున్నావ్! జీతం రాగానే ఎవరి వంక చూడకుండా—ఆఖరికి కాఫీ హోటలుకు వెళ్ళ కుండా ఆదేదో పెన్నిధి అయినట్టు జాగ్రత్తగా జీతం డబ్బులు పుచ్చుకుని, బస్సులో వెడితే కొట్టేస్తారని ఇంటికి నడిచి వెళ్ళి బామ్మగారి చేతిలో పువ్వులలో పెట్టి ఇచ్చేవాడట. ఇపుడు వ్యసనాలకు జీతం డబ్బులు చాలడం లేదు. పైగా మా అందరి దగ్గరా అప్పులు తీసుకుని మరీ పేకేటోపోతున్నాడు.'' చెప్పుకుపోతున్నాడు రామం.

సుబ్బలక్ష్మి తల పట్టుకుంది.

''రామంగారూ! నన్ను మాటలతో హింసించకండి. అసలు సంగతి చెప్పండి'' అన్నది దీనంగా సుబ్బలక్ష్మి.

''ఆఁ—ఏందాకా వచ్చాను?'' అడిగాడు రామం బుర్ర గోక్కుంటూ.

''పేకాట మరిగాడా! ఇపుడు మరొకటి మరిగాడు అన్నారు.'' నీరసంగా అన్నది సుబ్బలక్ష్మి.




"ఆఁ— పేకాట మరిగాడా! ఇపుడు మరొకటి మరిగాడు .... ఆ సినిమా హాల్లో ... ఏం సినిమా హాలు .... దాని పేరేమిటబ్బా!" బుర్ర గోక్కున్నాడు రామం.

"గోంగూర! ఏ హాలైతేనేం! అసలు విషయానికి రండి." సహనం నశించింది సుబ్బలక్ష్మికి.

"అదేమిటమ్మా! అలా తీసిపారేస్తావూ! ఆ సినిమా ఎపుడైనా చూశావా! ఎంత బాగుందో! ఆ సినిమా పేరు ఏమిటబ్బా! ..."

మళ్ళీ బుర్ర గోక్కున్నాడు రామం.

"ఏదో ఒక సినిమా! ఇపుడు జరుగుతోంది సినిమా కాదేమిటి?"

నుదురు బాదుకుంది సుబ్బలక్ష్మి.

"ఆఁ! జ్ఞాపకం వచ్చింది."

ఏం చెప్పబోతున్నాడో నని ఎదురుచూసింది సుబ్బలక్ష్మి.

"ఆ సినిమాలో హీరోయిన్ అచ్చు నీలాగా తల బాదుకుంది. ఎంత బాగా చేసిందనుకున్నావ్!"

హతాశురాలై పోయింది సుబ్బలక్ష్మి.

"నా మొగుడు సంగతి కాదు కాని, నా ప్రాణం తీస్తున్నారు—ఖర్మ ... ఇంతకీ మా వారు మరొక అమ్మాయితో సినిమాకు వచ్చా డంటారా?" ఆ మాట అబద్ధం కావాలని కోటి దేముళ్ళకు మనసులో మొక్కుకుంది.

వెంటనే రామం బుర్రలో ట్యూబులైటు వెలిగింది.

"ఆఁ! కనిపెట్టేశావమ్మా! కనిపెట్టేశావు! నాకేమీ జ్ఞాపకం ఉండి చావడం లేదు. మతిమరుపు ఎక్కువైంది. సుబ్బారావు మరొక అమ్మాయితో తిరుగుతున్నాడు. జాగ్రత్తగా చూసుకో, తల్లీ! ఎలా చూసుకుంటావో ఏమో! వెళ్ళొస్తానూ!" అని వెళ్ళిపోయాడు రామం.

తల తిరుగుతున్న ట్లనిపించింది సుబ్బలక్ష్మికి.

● ● ● ●

సుబ్బలక్ష్మి వెంటనే తలిదండ్రులకు, సుబ్బారావు బామ్మగారికి కబురుచేసింది. మరునాడు అటు సుబ్బారావు బామ్మగారు చంకలో సంచీతో కాలినడకన ఇటు సుబ్బలక్ష్మి తలిదండ్రులు సూట్‌కేసులతో రిక్షాలోనూ వచ్చారు. వాళ్ళని చూసిన వెంటనే సుబ్బలక్ష్మి గొల్లున ఏడుస్తూ చేతులు ముందుకు చాచుతూ పరుగెత్తి తల్లిని కావలించుకుంది. అదే క్షణంలో ముందుకు చాపిన బామ్మగారి చేతులు క్రిందికి వాలిపోయాయి. వాళ్ళందరూ ఇంట్లోకి రాగానే మొదలయింది ఇరుపక్షాల సంగ్రామం.

"మా పిల్ల గొంతు కోశారు." సుబ్బలక్ష్మి తలిదండ్రులు.

"మా మనవడి గొంతు కోశారు." బామ్మగారు.

"జగ్గమే మాయ్యా! బ్రతుకే మాయ్యా! వేధాలలో సారమింతేనయ్యా!" అందరూ ఉలికిపడి పాట వినబడిన వైపు చూశారు— సుబ్బారావు! అతని చేతిలో సీసా! తూలుతూ వస్తున్నాడు.

"హిప్పి! ఇంతమంది వచ్చారు! మనింట్లో ఏవన్నా ఫంక్షనా ..." మామగారి వైపు తిరిగి "ఎవరండీ మీరు?" అని, కళ్ళు బలవంతాన తెరిచి అడిగాడు.

'ఉన్న అలవాట్లు చాలక ఈ తాగుడు కూడా మొదలెట్టారు—ఖర్మ' అని నుదురు బాదుకుంటూ "మీ మామగారండీ" అన్నది సుబ్బలక్ష్మి దుఃఖంతో.

"మీ మామగారా! ఆయ నెప్పుడో పోయాడు కదోటీ!" గట్టిగా నవ్వాడు సుబ్బారావు.

"ఖర్మ! మా మామగారు కాదు. మీ మామగారు— అంటే మా నాన్నగారు." నెత్తిమీద బాదుకుంటూ చెప్పింది సుబ్బలక్ష్మి.

"అచ్చా! రా, మావాఁ! చాలా కాలానికి వచ్చారు! గదిలోనికి వెళ్ళి మందు కొడదాం" ఆయన చేతులు పట్టుకొని బలవంతాన గదిలోనికి లాక్కొచ్చాడు.

జారిపోతున్న ఉత్తరీయాన్ని, పంచను సర్దుకుంటూ అల్లుడి భల్లూకపు పట్టులోనుంచి తప్పించుకోవడానికి పెనుగులాడుతున్నారు మావ గారు. మామగారిని మంచం మీద పడుకోమని చెప్పి తాను కుర్చీలో కూర్చున్నాడు సుబ్బారావు. వెంటనే ఏదో స్ఫురించినట్లు తను లేచి మామగారిని మంచంమీద నుంచి లాగి కుర్చీలో కూర్చోపెట్టి తాను మంచం మీద పడుకున్నాడు.

"పుచ్చుకో, మావాఁ! పుచ్చుకో! ఖుషి చెయ్. నా సామిరంగా—గుర్రం మీద స్వారీ చేసినట్లుంటుంది."

మామగారు చీదరించుకున్నారు. "చూడు, నాయనా!" అని పలకరించబోయారు.

"అత్తగారూ!" గట్టిగా కేకేశాడు సుబ్బారావు.

"వస్తున్నా న్నాయనా వస్తున్నా" అంటూ వచ్చింది అత్తగారు.

"కాస్త ఈ మందు పుచ్చుకుంటారూ! ఈయన కంపెనీ ఇవ్వడం లేదు."

"చటవేస్తే ఉన్న మతి పోయిందిట." గొణుక్కుంటూ వచ్చిన దారినే వెళ్ళింది అత్తగారు.

"చూడు, బాబూ!" అంకించుకున్నారు మామగారు.

చిరాకెత్తింది సుబ్బారావుకు.

"నే నిప్పుడు ఎవరినీ చూడను. మందు తాగని వాడితో నేను మాట్లాడను. గెటవుట్ ఫ్రమ్ హియర్!" అరిచాడు సుబ్బారావు.

చేసేదేం లేక పంచకున్న గోచీని సవరించుకుంటూ బయటకు వెళ్ళారు మామగారు.

"సుబ్బులూ..." మళ్ళీ సుబ్బారావు కేక.

"వస్తున్నా" అంటూ, 'కొంపదీసి బలవంతాన ఆ విస్కీయో పాడో నోట్లో పోయడు గదా' అనుకుంటూ వెళ్ళింది సుబ్బలక్ష్మి.

"నాకు అన్నం పట్రా! ఫో!" అన్నాడు సుబ్బారావు.

'అమ్మయ్య! గురుడు దారికి వచ్చాడు' అనుకుంటూ "అమ్మా! ఆయన గారికి అన్నం పట్టావే!" అని కేకేసింది సుబ్బలక్ష్మి.

"టట్!" మళ్ళా అరిచాడు సుబ్బారావు.

"మళ్ళీ ఏమొచ్చింది?" కంగారుగా అడిగింది సుబ్బలక్ష్మి.

"నేను అడిగింది నిన్ను. వెళ్ళు—నువ్వే స్వయంగా తీసుకురా! ఫో!"

ఆపసోపాలు పడుతూ భోజన పళ్ళాన్ని తీసుకు వచ్చింది సుబ్బలక్ష్మి.

"ఎవరు చేశా రీ వంట?" అడిగాడు సుబ్బారావు.

"మా అమ్మ!" భయపడుతూ చెప్పింది సుబ్బలక్ష్మి.

"టట్! అమ్మా, బొమ్మాను. నీవే స్వయంగా వండి తీసుకురా ఫో!" పళ్ళాన్ని విసిరి కొట్టాడు సుబ్బారావు.

ఇంతలో మామగారు పంచకున్న గోచీ సవరించుకుంటూ వచ్చారు.

"నాయనా! అమ్మాయి చేసినా పళ్ళెం విసిరి కొట్టవని నమ్మకం ఏమిటి?"

ఆకాశం ఎత్తున ఎగిరాడు సుబ్బారావు.

"ఎవ్రడా నువ్వు! మొగుడూ పెళ్ళాల గొడవలో తల దూరుస్తావ్! నేను తింటానో, పారేస్తానో, దానిని కొడతానో నీ కెందుకంట! ముందు ఇక్కడ్నుంచి మర్యాదగా బయటకు వెళ్ళు." హుంకరించాడు సుబ్బారావు..

నెత్తిన ఉత్తరీయం వేసుకుని బయట కెళ్ళి

పోయారు మామగారు.

అరగంటలో చెమటలు కక్కుకుంటూ భోజనం తయారుచేసి తీసుకు వచ్చింది సుబ్బలక్ష్మి.

అబగా తిన్నాడు సుబ్బారావు. తృప్తిగా నిట్టూర్చింది సుబ్బలక్ష్మి.

నెత్తిన ఉన్న ఉత్తరీయాన్ని భుజాన వేసుకున్నారు మామగారు.

జారిపోయిన మునుగును నెత్తిమీదికి లాగేసుకుంది బామ్మగారు.

దేవుడికి దణ్ణం పెట్టింది అత్తగారు.

''ఇహ! నేను పడుకుంటాను. ఆట్టే గొడవ చేయకండి. మళ్ళీ యుద్ధం మొదలెట్టారా—ఈ సీసాతో తలొక బాదుడు బాదుతాను—జాగ్రత్త!'' అని సీసాలోని ద్రవం గట గట త్రాగి త్రేవుపుని త్రేన్చి పడుకున్నాడు సుబ్బారావు. అంతే—అందరూ గప్ చిప్!

నాలుగు గంటలకు సుబ్బారావు లేచాడు.

''టిఫిన్...'' అరిచాడు.

''ఏమండీ!'' భయపడుతూ వచ్చింది సుబ్బలక్ష్మి.

''ఏమిటీ?'' ఇంకో సీసా సూటు కేసులో నుంచి బయటకు లాగాడు.

''ముందీ తాగుడు మానేయండి.''

''మీరు కాఫీ మానేస్తున్నారా? ఇదీ అంతే!''

''నేనేం పాపం చేశానని ఈ శిక్ష?''

''శిక్షకాదు--కక్ష!'' అన్నాడు సుబ్బారావు.

''ఎవరిమీద?''

''ఇంకెవరి మీద! నీ మీదే!''

''ఎందుకు?''

''తరవాత తెలుస్తుంది. ముందు టిఫిన్ నీ చేత్తో స్వయంగా తయారుచేసి తీసుకురా ఫో!'' కసిరి బయటకు వచ్చాడు సుబ్బారావు.

''డియర్ లేడీస్ అండ్ జంటిల్‌మెన్! అటెన్షన్ ప్లీజ్! ఎవరైనా నా భార్య ఇంటి పనులలో కలగ చేసుకున్నారో వారి మీద కఠిన చర్య తీసుకో బడుతుంది. బి కేర్‌ఫుల్!'' అని అరిచి తిరిగి గదిలోకి వచ్చాడు సుబ్బారావు.

'పిడికేమీ పిచ్చి ఎక్కలేదు గదా' అనుకుంటూ మొహమొహాలు చూసుకున్నారు బామ్మగారు, అత్తగారు వగైరా ...

టిఫిన్ తయారుచేసి తీసుకువచ్చింది సుబ్బలక్ష్మి.

తిన్నాడు సుబ్బారావు.


''రాత్రి వంట కూడా నీవే చెయ్యాలి. లేకపోతే ఇదిగో—ఇంకో సీసా!'' చూపించాడు సుబ్బారావు.

''మీ సీసాలు తగలెయ్య! ఏకంగా కొట్టు కొట్టంతా తీసుకొచ్చి ఇక్కడ దుకాణం పెట్టారు. వంట చేయక చస్తానా'' అంది సుబ్బలక్ష్మి.

''ఇదిగో! నా బట్టలు అక్కడున్నాయ్! అవన్నీ రాత్రికి ఉతికేసి ఆరేయాలి! తెల్సిందా! లేకపోతే ఇంకో ...'' సూటుకేసులో నుంచి పీకుతున్నాడు సుబ్బారావు.

''తెల్సింది, మహా ప్రభో! తెల్సింది. ఆ సీసా అక్కడ పెట్టండి'' అని సుబ్బలక్ష్మి వెళ్ళిపోయింది.

ఈ విధంగా నాలుగు రోజులు గడిచాయి. సుబ్బారావు బయటకు వెళ్ళలేదు. తాగుడు తగ్గించాడు. మళ్ళీ ఎక్కడ తాగుతాడో అని ఎప్పటికప్పుడు




అతని అవసరాలను గమనిస్తూ ఇంటి పనులన్నీ చేసుకుంటూ పోతోంది సుబ్బలక్ష్మి.

ఐదో రోజు రాత్రి పనులయ్యాక సుబ్బలక్ష్మిని గదిలోకి పిలిపించాడు: ''రా, సుబ్బులూ, రా. ఖుషి చేద్దాం! ఏదీ ఒక పట్టు పట్టు.'' బలవంతాన ఆమె నోరు తెరచి సీసాను వంచాడు సుబ్బారావు.

మొదట్లో పెనుగులాడినా తరవాత అది పట్టే మంచినీళ్ళని గ్రహించింది సుబ్బలక్ష్మి.

గాట్టిగా నవ్వి ఆ సీసాలన్నీ కిటికీలోనుంచి బయటకు విసిరేశాడు సుబ్బారావు.

''ఇంతా చేసి ఇది మంచినీళ్ళా! ఏదో అనుకున్నాను. భలే హడల కొట్టేశారు. ఇంతకీ నేను చేసిన పాపం ఏమిటి?''

సుబ్బలక్ష్మిని కౌగిలిలోకి తీసుకున్నాడు సుబ్బారావు.

''ఇంకా అర్థంకాలా! నీ చేత వంటపని, ఇంటిపని చేయించడానికి...'' నవ్వాడు సుబ్బారావు.

''మరి పేకాట...!''

''నేను ఆడగా నీవు చూశావా! మా ఆఫీసులోని స్నేహితులు రామం, మోహన్ ఆడిన నాటకం!''

''మరి సినిమాహాల్లో అమ్మాయ్!''

''అదీ నాటకమే! అమ్మాయి లేదు, బొమ్మాయి లేదు. మొద్దూ! అసలు ఆ సినిమాకు వెళ్ళందే'' అన్నాడు సుబ్బారావు.

''ఎంత కంగారు పెట్టేశారండీ! నిజంగా నాకు బుద్ధి వచ్చింది. ఇహనుంచి ఇంటి పనులు నేనే చేస్తాను.''

''పాపం! మనవాళ్ళందరిని నొప్పించాను. మందు గురించి మీ కేమీ తెలియదల్లే ఉంది. తాగితే నోట్లోంచి గుప్పున వాసన కొడుతుంది. ఒట్టి అమాయకుళ్ళా ఉన్నారు—నిజమే ననుకున్నారు. గట్టిగా నవ్వాడు సుబ్బారావు. సుబ్బలక్ష్మి కూడా కిలకిలా నవ్వింది.

బయట ఉన్న వాళ్ళందరూ ఉలిక్కిపడి లేచారు. మొహమొహాలు చూచుకున్నారు. ఒక్కొక్కరి మొహం ఆనందంతో వెలిగిపోయి గదంతా పర్చుకుంది. ఏదో అర్థమైనట్లు గుసగుసలాడారు.

ఇవతల సుబ్బారావు, సుబ్బలక్ష్మి రసమయ ఘట్టంలో ఉండగా అవతల ''టక్! టక్!'' అని తలుపు కొట్టిన చప్పుడు.

చిరాగ్గా తలుపు తీశాడు సుబ్బారావు.

బామ్మగారు! చంకలో సంచీ!

''మన వూరికి వెడుతున్నాను, సుబ్బిగా.''

''అదేమిటి, బామ్మా! ఇంత రాత్రప్పుడు...''

''అవతల పిడకలు!''

''వెధవ పిడకలు ... నీ చాదస్తం మానవుగదా!'' తలుపేశాడు సుబ్బారావు.

మళ్ళీ తలుపు టక్! టక్!

ఈ సారి సుబ్బలక్ష్మి చిరాగ్గా తలుపు తీసింది.

ఎదురుగా సుబ్బలక్ష్మి అమ్మగారు!

''అమ్మాయ్, సుబ్బులూ! మా వూరికి వెడుతున్నాము.''

''ఇంత రాత్రివేళ ప్రయాణం ఏమిటమ్మా?''

''అవతల చాలా పనులున్నాయ్!''

''సరే!'' అని తలుపు వేసింది సుబ్బలక్ష్మి.

టక్ ... టక్! మళ్ళీ తలుపు చప్పుడు.

ఈ సారి క్రోధంగా తలుపు తీశాడు సుబ్బారావు.

ఎదురుగా మామగారు! చేతిలో సూట్‌కేస్!

''క్షమించండి, మామగారూ! ఇదంతా నే నాడిన నాటకం, మీ అమ్మాయి చేత పని చేయించటానికి. ఏమనుకోకండేం!''

''విన్నాం, బాబూ! విన్నాం. మొత్తానికి మా అమ్మాయిని దార్లో పెట్టావు. సంతోషం. పానకంలో పుడకల్లాగా ఇక్కడ మేము ఎందుకు? వూర్లో చాలా పనులున్నాయి వెళ్ళి వస్తాను'' అని చెప్పి వెళ్ళిపోయారు మామగారు.

''ఇహ తలుపు వేయాల్సిన పని లేదు. తలుపు వేసిన దగ్గర్నుంచి టకాటక్, టకాటక్! ఎందుకొచ్చిన గొడవ!'' అంటూ సుబ్బలక్ష్మిని ఆక్రమించు కున్నాడు సుబ్బారావు. ★